## ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం



-వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం
-నిర్దిష్ట గడువులోగా పనులు చేపట్టాలి
-వెలుగుమట్లలో ఇంటి నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్

2లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 24 | జూన్ | 2026
పేజీలు : 8

# సుప్తావస్థలో విద్యాశాఖ..!




-అనుమతులు లేకుండానే పాఠశాలల నిర్వహణ
-పట్టించుకోని అధికారులు
-వాణిజ్య భవనాల్లోనూ తరగతుల నిర్వహణ

పిల్లి కండ్లు మూసుకుంటే ఎలుక ఎక్కిరించిందట. అలా తయారైంది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విద్యాశాఖ, ప్రైవేటు విద్యాసంస్థల వ్యవహారం. విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడంతో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఇష్టానుసారంగా ప్రైవేటు విద్యా సంస్థలను నెలకొల్పుతున్నారు. అనుమతులు లేకుండానే విద్యా సంస్థలు నెలకొల్పిన, నిబంధనలను పట్టించుకోకపోయినా అధికారులు కనీస చర్యలు తీసుకోవడంలేదు. ఒక్క ఖమ్మం నగరంలోనే దాదాపు 20 విద్యా సంస్థలు కనీస అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారంటే ఆశ్చర్యం కలుగక మానదు. విద్యాశాఖ ఇంతగా ఎందుకు ప్రైవేటుకు దాసోహం అంటుందో అవగతం కావడం లేదు. అనుమతులు లేని పాఠశాలల నిర్వహణతో విద్యార్థుల భవితవ్యంతో చెలగాటమాడుతున్నా విద్యా శాఖాధికారులు స్పందించకపోవడం పలు అనమానాలకు తావిస్తుంది. ప్రత్యక్షంగానే అనుమతులు లేని, నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో

## పేదలపై కాంగ్రెస్ కక్ష సాధింపు




-పేదల స్థలాల స్వాధీనాన్ని ఉపసంహరించుకోవాలి
-జర్నలిస్టులకు తక్షణం నివాస స్థలాలను పంపిణీ చేయాలి
-బిఆర్ఎస్ నేత హరీష్‌రావు

ప్రజాపక్షం/ఖమ్మం : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల కక్ష సాధింపు వైఖరి అవలంభిస్తుందని నివాస స్థలాలను సైతం అక్రమ పద్ధతుల్లో స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీష్‌రావు ఆరోపించారు. ఇటీవల జరిగిన వెలుగుమట్ల ఘటన మరిచిపోక ముందే ఇప్పుడు రఘునాథపాలెంలో పేదలకు ఇచ్చిన స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం గుంజుకుంటుందని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా

మిగతా 2లో..

## విబి జీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలి




-మోడీది పేదల వ్యతిరేక ప్రభుత్వం
-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్
-వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



ప్రజాపక్షం/ ఖమ్మం : వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గర్ అండ్ అజీవిక మిషన్ (విబిజి రాంజీ ) పథకం గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బతీసేవిధంగా రూపొందించారని ఈ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. గతంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సవరించి నూతనంగా పలు నిబంధనలను చేర్చారని ఈ నిబంధనలతో ఉపాధి కరువవుతుందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విబిజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని దాని స్థానంలో తిరిగి మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, పని దినాలను పెంచాలని, దినసరి కూలీ రూ.700 గిట్టుబాటు అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని

మిగతా 2లో..

# సుప్తావస్థలో విద్యాశాఖ..!

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ విద్య పలు సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రైవేటు విద్యా సంస్థలకు ఆదరణ పెరుగుతుంది. విద్య వ్యాపారంగా మారడం అది లాభసాటిగా ఉండడంతో కొందరిని మినహాయిస్తే చాలా మంది లాభార్జనే ధ్యేయంగా విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. నిబంధనలకు లోబడి ప్రైవేటు విద్యా సంస్థల నిర్వహణ తప్పు కాదు కానీ అసలు విద్యా సంస్థ ఏర్పాటుకు అనుమతులు పొందకుండానే విద్యా సంస్థలను ఏర్పాటు చేసి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టి తరగతులు నిర్వహిస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అన్నింటికి మించి అనుమతులు లేని పాఠశాలల జాబితా విద్యాశాఖాధికారుల వద్ద ఉండటం అయినా చేష్టలుడిగి చూస్తుండటం పై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క ఖమ్మం నగరంలోనే 20 విద్యా సంస్థలు అందు లో జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలు ఉండటం అయినా ఇం త వరకు ఆ పాఠశాలల వైపు విద్యాశాఖాధికారులు కన్నెత్తి చూడటం లేదు. లంచాలతో విద్యాశాఖను నిద్రపుచ్చుతున్నారా లేక విద్యాశాఖపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారా అన్న విషయం కూడా తేలాల్సి ఉంది. ఖమ్మం నగరంలో ఒక పాఠశాల ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహించడంతో పాటు ఒక కమర్షియల్ భవనంలో తరగతులు నిర్వహించడం జరుగుతుంది. దీనిపై పలు ఫిర్యాదులు వచ్చిన విద్యాశాఖకు సంబంధించిన ఏ ఒక్కరూ ఆ పాఠశాలను సందర్శించ లేదు. జూనియర్ కళాశాలల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. మీకు అనుమతులు రాకపోతే ఆ సంస్థల్లో చేరిన విద్యార్థుల భవితవ్యం ఏమిటన్నది విద్యాశాఖాధికారులకే తెలియాలి. కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ఏడవ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉండగా పదవ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఉండే బోధనా సిబ్బంది జాబితా కానీ, మౌలిక వసతుల వివరాలు కానీ ఉండవు. ఇక ఇంటర్ విద్యకు సంబంధించి అనుమతులు లేకుండానే అబ్బుర పడే రీతిలో ప్రచారం కల్పిస్తూ అడ్మిషన్లు చేస్తున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదు. మరి కొందరు అకాడమీలను ఏర్పాటు చేసి అకాడమీల నుంచి ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు చేస్తున్నారు. అకాడమీలకే అనుమతులు లేకుండా నిర్వహిస్తూ ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్నా అధికార యంత్రాంగం స్పందించడం లేదు. అనుమతులు లేని పాఠశాలలు, కళాశాలల ఎదుట ఆందోళనలు నిర్వహించినా విద్యాశాఖ తమకు ఎందుకులే అన్న రీతిలో వ్యవహరిస్తుంది. ప్రభుత్వ విద్యను పర్యవేక్షణ లేకుండా నిర్వీర్యం చేసిన విద్యాశాఖాధికారులు ప్రైవేటు పాఠశాలల విషయంలో అనుసరిస్తున్న వైఖరి పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు విద్యా సంస్థలు ఏకంగా జిల్లా విద్యాశాఖనే శాసిస్తున్నాయని ఫీజులు, మౌలిక వసతుల కల్పన, విద్యాలయాలనే వ్యాపార సంస్థలుగా మార్చి పుస్తకాలు, ఇతరత్రా విక్రయాలు జరుపుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మొత్తంగా విద్యాశాఖ ప్రక్షాళన జరగాల్సి ఉంది. అనుమతులు లేని పాఠశాలల పట్ల కఠినంగా వ్యవహరించకపోతే ఆయా పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులకు స్ప ష్టమైన ఆదేశాలిచ్చినా జిల్లా, మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోవడంలేదు. దీనిపైవెంటనేస్పందించాల్సినఅవసరంఎంతైనా ఉంది.

# విబి జీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలి




**(మొదటిపేజీ తరువాయి)**

డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభుత్వమని పేదలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా ఉన్న పథకాలకు తూట్లు పొడుస్తుందన్నారు. దశాబ్దాల కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడంతో పాటు ఉపాధిని దెబ్బ తీయడం, గ్రామీణ పేదలను ఇబ్బంది పెట్టే రీతిగా నిబంధనలు రూపొందించి నూతన పథకాన్ని జూలై ఒకటి నుంచి అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. రెండు సార్లు ఫోటో తీసే పద్ధతిని తక్షణం రద్దు చేయాలని, గతంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథాతదంగా అమలు చేయాలన్నారు. గతంలో కేంద్రం 90 శాతం భరిస్తే రాష్ట్రాలు పది శాతం భరించేవని ఇప్పుడు రాష్ట్రాల వాటా 40 శాతానికి పెంచి కేంద్రం భారాన్ని రాష్ట్రాలపై మోపుతుందని ఆరోపించారు. డీజిల్, గ్యాస్, పెట్రో ధరలను పెంచడం ద్వారా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సైతం వైఫల్యం చెందిందని, కొత్త పింఛన్లు జూన్ రెండు నుంచి ఇస్తామని చెప్పిన ఇంత వరకు ఆ ఊసు లేదని సురేష్ తెలిపారు. నెలకు రూ. 2,500 మహిళలకు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని పింఛన్ల పెంపు జరగలేదని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా సరైన రీతిలో అమలు కాలేదని సురేష్ తెలిపారు. పేదల గుడిసెల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని దశాబ్దాల పాటు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటున్న వారి పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తూ అమానుష చర్యలకు పాల్పడుతుందని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జాతీయ ఉపాధి హామీ పరిరక్షణ కోసం పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, ఆదినారాయణ, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, ఏనుగు గాంధీ, యంగళ ఆనందరావు, ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, పగిళ్ల వీరభద్రం, సత్యనారయణ, వీరబాబు, సుధాకర్, గోపాలరావు, మహేష్, ఈశ్వరమ్మ, రంజాన్‌బీ పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు అందజేశారు.

# పేదలపై కాంగ్రెస్ కక్ష సాధింపు

**(మొదటిపేజీ తరువాయి)**

ఎంపి వద్దిరాజు రవిచంద్ర నివాసంలో సర్వే నెం.218 ఇండ్ల స్థలాల నిర్వాసితుల సంఘం సమావేశంలో హరీష్‌రావు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రఘునాథపాలెం మండలం సర్వే నెం.218లో బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో 650 మందికి పట్టాలు అందజేశారు. ఇప్పుడు ఇంటి గ్రేటెడ్ స్కూల్స్, జాతీయ రహదారి నిర్మాణం పేరుతో ఆ స్థలాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా మిగిలిన స్థలాలను కూడా స్వాధీనం చేసుకోవడంపై బాధితులు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ సమక్షంలో హరీష్‌రావును కలిసి తమ గోడు వెలిబుచ్చుకున్నారు.ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యమంటే పేదలకు సాయం చేయాలని కానీ ఉన్నది గుంజుకోవడం కాదన్నారు. మేము ప్లాట్లు ఇచ్చాం, నెంబర్లు కూడా కేటాయించాం చేతనైతే మీరు ఇండ్లు కట్టించండి అంతే తప్ప గుంజుకునే పరిస్థితి తీసుకు రావద్దని ఆయన సూచించారు. ఇప్పటికే కలెక్టర్‌తో మాట్లాడామని ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేదలకు స్థలాలు దక్కేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. వెలుగుమట్ల కన్నీళ్లు చూశాక కూడా రఘునాథపాలెంలో మళ్లీ పేదల స్థలాలను గుంజుకునే ఆలోచన చేస్తుండటం గమనార్హమన్నారు. విలువైన స్థలం పేదల వద్ద ఉండకూడదని గుంజుకుంటున్నారా అని హరీష్‌రావు ప్రశ్నించారు. గృహలక్ష్మి క్రింద ఇండ్లు మంజూరైతే కొందరు పునాదుల వరకు నిర్మించుకున్నారని వాటిని కూల్చడం అమానుషమని ఆయన తెలిపారు. రేవంత్ రెడ్డి హిట్లర్‌తో పోల్చుకుని హైడ్రా ఏర్పాటు చేసినట్లు ప్రకటించారని కానీ ఆయనకు రాష్ట్రంలో కౌంట్‌డౌన్ స్టాట్ అయిందని హరీష్‌రావు తెలిపారు. పేదల ఊసురుపోసుకుంటే తిరగబడే రోజులు వస్తాయని ఆయన హెచ్చరించారు. నగదు రహిత వైద్యం పేరుతో 1.5 శాతం వేతనంలో కోత విధించారని కానీ రేవంత్‌ను నమ్మి ఏ ప్రైవేటు ఆసుపత్రి ఈ పథకం పరిధిలోకి రావడం లేదని ఆయన తెలిపారు.రాష్ట్రంలో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు నడుస్తున్నాయని కానీ ఇవి ఎల్లకాలం నడవబోవని హరీష్‌రావు తెలిపారు. ఖమ్మంలో జర్నలిస్టులకు అప్పటి కేసిఆర్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించిందని క్యాబినెట్ ద్వారా ఆమోదం పొందిన ఈ స్థలాలను తక్షణం పంపిణీ చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇస్తున్నప్పుడు ఖమ్మంలో ఇచ్చేందుకు జంకేందుకని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, తక్కెళ్లపల్లి రవీంద్రరావు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, ఏనుగుల రాకేష్‌రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవ ప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని, హౌసింగ్ శాఖాధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీలో ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు చేశామన్నారు. ఇండ్లకు విద్యుత్ కనెక్షన్లతో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రభుత్వం పేదలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలు పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సాయం విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇండ్ల నిర్మాణ విషయంలో రెవెన్యూ, హౌజింగ్, విద్యుత్, మున్సిపల్ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, ఈఈ జగ్గారావు, హౌజింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి




**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపై ద్యాస సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు అన్నారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముందుగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక అని క్షణకాలపు ఆనందం కోసం మత్తు పథార్థాలకు అలవాటుపడి తల్లి దండ్రుల ఆశలను, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల అలవాటు వలన శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎంపిక చేసుకోవాలని సినిమాలలో ఉండే మంచిని స్వీకరించి చెడును వదిలేయాలని కోరారు. చదువు, వ్యక్తిగత జీవితం నుండి ఒత్తిడిని జయించటానికి క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. మహిళలకు, విదార్థినులకు రక్షణగా జిల్లాలో షీటీమ్స్ పని చేస్తున్నాయని అత్యవసర పరిస్థితుల్లో 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. స్వీయ రక్షణతో కూడిన డ్రైవింగ్ చేయాలని దీనితో రోడ్డు ప్రమాదాలను నివారించటానికి ఆస్కారం ఉందని, డ్రైవర్లు సీట్ బెల్ట్, హెల్మెట్‌లు ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి,రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ర్యాష్ లాంటి డ్రైవింగ్ ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, సిఐ సతీష్, ఎక్సైజ్ సిఐ ప్రసాద్, పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సురేష్, ఎస్‌బిఐ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ, కళాశాల అద్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు : ఎస్‌ఐ



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండలంలోని చొప్పకట్ల పాలెం శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మాచినేని రవి హెచ్చరించారు. చొప్పకట్ల పాలెం గ్రామానికి చెందిన తుపాకుల నరేష్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌పై ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

# రైతు ఆత్మీయ ఆశీర్వాద సభను విజయవంతం చేద్దాం



**ప్రజాపక్షం/ ముదిగొండ :** ఈనెల 30న చింత కాని మండలంలో నిర్వహించనున్న రైతు ఆత్మీయ ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపూడి బుచ్చిరామయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కమలాపురంలో నిర్వహించిన మండల కాంగ్రెస్ ఆర్గనైజేషన్, జోన్ ఇంచార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలించేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సభ విజయవంతానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో జోన్ ఇంచార్జిలు, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కమిటీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయాలను కేస్ స్టడీలుగా నమోదు చేయాలి




-ప్రతి శాఖ సమగ్ర నివేదికలు రూపొందించాలి
-రోడ్డు ప్రమాదాల తగ్గుదలపై విశ్లేషణ చేయాలి
-ప్రగతి ప్రణాళికపై అధికారులతో సమీక్షించిన జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి, ఐటి శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమ విజయ గాధలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతిశాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయగలిగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కొనాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు వాటి స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికలో పొందుపర్చాలన్నారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్ల మరణాల్లో వచ్చిన తగ్గుదలను గతేడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిభింభించేలా నివేదికలు రూపొందించాలన్నారు. జిల్లాలో గురుకుల పాఠశాలలో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. యంగ్ ఇండియా స్కూళ్లకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామన్నారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టి విజయవంతం చేశామన్నారు. ఈ సమీక్షలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# మంచిపాలన అందించడమే ధ్యేయం



రాజకీయాలకతీతంగా వార్డుల అభివృద్ధి
పాలకవర్గ సభ్యులు ఒక కుటుంబం
మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీఓ ఎలాంటి అవినీతి లేకుండా మంచి పాలన అందించడమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం వైరాలో కాంగ్రేస్ కార్యాలయం నందు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు దాటింది. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకుండా వరద ప్రవాహం లేకుండా ఉండేవిధంగా ముందస్తు చర్యల్లో భాగంగా ఇందిరమ్మ కానీ వద్ద పూడికతీత పనులు చేపట్టడం జరిగింది. అదేవిధంగా వైరా మున్సిపాలిటీఓ మేజర్ డ్రైనేజీ నీరు ప్రవహించే కాల్వను గత 25 సంవత్సరాల నుండి పూడిక తీయలేదని దానిని పూడిక తీపించడం జరిగిందని, పూడిక తీయడం వలన నీరు ఎక్కువ నిల్వ ఉండకుండా ముందుకు పోతుంనది తెలిపారు. గాంధీచౌక్‌లో గాంధి విగ్రహం వద్ద సుందరంగా పార్క్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగింది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడమే నా ధ్యేయం. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతాను. ఎవరిపై ఎలాంటి వివక్షత చూపను, మున్సిపల్ సమావేశంలో ఏర్పాటు చేసిన తీర్మానాలు వారికి తెలిసిన తర్వాతే ప్రవేశపెట్టడం జరిగింది. నా భర్త కాపా మురళీకృష్ణ ఎక్కడ అసభ్యంగా మాట్లాడలేదు. తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆమె అన్నారు. అవినీతికి తావు లేని పాలన అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతాము, డీజిల్ ఎలాంటి కుంభకోణం జరగలేదు. మా పాలకవర్గం వచ్చిన తర్వాత డీజిల్ ఖర్చు తగ్గించడం జరిగింది అని అన్నారు. అనంతరం శబుం వెంకటనర్సిరెడ్డి, కాపా మురళీకృష్ణ, ముళ్ళపాటి సీతారాములు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పార్టీ పాలనలో అభివృద్ధి నోచుకోలేదని, రాష్ట్రంలో ఇందిరమ్మ ఆపలన వచ్చిన తర్వాత భట్టివిక్రమార్క సారధ్యంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కొందరు మాట్లాడుతున్నారని, బిఆర్ఎస్ పాలనలో దళిత బంధువు అమ్ముకున్న సందర్భాలు ఉన్నాయని వారు గుర్తు చేశారు. ఇందిరమ్మ పాలనలో రైతులను అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముళ్ళపాటి విజయలక్ష్మి, బత్తుల సుమతి, బలరామయ్య, రాచబంటి శ్రీదేవి, మార్కెట్ చైర్మన్ గంగారావు, నాయకులు పుంద్రు శ్యామ్‌బాబు, మండల కాంగ్రేస్ మండల, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, పువ్వాళ్ళ రాము, కొల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులపై దాడులు, అక్రమ కేసులు ఆపాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గిరిజనులపై అటవీ శాఖ అధికారులు చేస్తున్న వేధింపులు, దాడులు నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజనులతో కలిసి మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ చెరుకుపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు గత 40 సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అయితే అటవీ శాఖ అధికారులు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ సాగులో ఉన్న భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గిరిజనులపై అక్రమ కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలు ఆందోళనకరమని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, మంత్రులు ఇచ్చిన హామీలను కూడా కొందరు అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేసి గిరిజన కుటుంబాలకు భరోసా కల్పించాలని, గిరిజనులను వేధిస్తున్న అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకొని అవసరమైతే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటి కుమారి, తాటి రాధా, గడ్డం తిరుపతమ్మ, తాటి భద్రమ్మ, పోతురాజు, రాణి, వెంకటలక్ష్మి , రజిని, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/తల్లాడ:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఎబీవీపీ) పిలుపు మేరకు మండలంలోని విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని విస్మరించి ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతూ..ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం దురదృష్టకరమని, విద్యాశాఖకు పూర్తిస్థాయి నాయకత్వం లేకుండా విద్యా వ్యవస్థ ఎలా సమర్థవంతంగా నడుస్తుందని ప్రశ్నించారు. విద్యారంగ పరిరక్షణకై చేపట్టిన ఉద్యమానికి సహకరించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా తల్లాడ మండల అధ్యక్షుడు చల్లా నాగులు, జిల్లా నాయకులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శులు రాయల రమేశ్, పేరిక కిరణ్, నాయకులు చౌడా నాగేశ్వరరావు, చల్లా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో విత్తన మేళా



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఏడు క్లస్టర్ రైతు వేదికలలో మంగళవారం నుండి 30 వ తేదీ వరకు విత్తనమేళాలు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా రైతు నేస్తం కార్యక్రమం జరిగింది. విత్తన మేళ లో రైతులకు నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం గుర్తింపు పొందిన సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలు వాటిని గుర్తించి విధానంపై సాగు అనువైన సన్నవోడ్లు రకాలు అలాగే నానో యూరియా మరియు నానో డీఏపీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, వ్యవసాయ శాఖ అధికారిని రూప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందవ్రావు, మండల పార్టీ అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, పట్టణ అధ్యక్షులు ఉస్మాన్, మున్సిపాలిటీ కమిషనర్లు, ఏ ఈ ఓ లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవానికి సిద్ధం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలోని పలు గ్రామాలలో మొక్కలు నాటేందుకు వన మహోత్సవ కార్యక్రమానికి సిద్ధమైనట్లు ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో వేమమాలినిలు తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలు అంతర్గత రహదారులు ఇంటింటికి మొక్కలు నాటే కార్యక్రమం పంపిణీ కార్యక్రమం తో పాటు ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ వారి శాఖల ఆధ్వర్యంలో మొక్కలను నాటేందుకు వన మహోత్సవ కార్యక్రమాన్ని ఈ వారంలో అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఏపీవో లు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఒక ఉత్సవంలా ఉద్యమంలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** యువత మాధద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మంచిగా చదువుకొని బంగారు భవిష్యత్ సాధించాలని మధిర రూరల్ ఎస్సై విశ్వతేజ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో సర్పంచి సిద్దిపోగు ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలల్లో మాధకద్రవ్యాలు వాటి పరిణామాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మాధకద్రవ్యాలకు సంబంధించి అనుమానితుల సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ ఛైర్మన్ అయిలూరి సత్యనారాయణ రెడ్డి, పోలీసు సిబ్బంది కోట ధర్మ, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలోమంగళవారం పెనుబల్లి లోని పెనుబల్లి, గౌరారం , కుప్పెన కుంట్ల, మండల పాడు, కొండ్రుపాడు, లంకపల్లి రైతు వేదికల నందు రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు రైతు వేదికలలో విత్తనమేల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి ప్రసాద రాజు మాట్లాడుతూ వానకాలం 2026 సంవత్సరానికి గాను వరిలో సన్న రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏడు సన్న వడ్ల రకాలను సూచించింది అవి బీపీటీ 5204 ఆర్ యన్నారు 15048 (తెలంగాణ సోనా), హెచ్ యంటి సోనా శ్రీ రామ్, కెయన్మ్ 1638,డబ్ల్యూ 44 (సిద్ది), కెయన్ మ్ 7715 ఈ పైన తెలిపిన ఏడు రకాలకు మాత్రమే బోనస్ ఇవ్వటం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కె నరేష్, జి శివ కుమార్, షర్మిద, బుచ్చిబాబు, సమంత, పంది వెంకటేశ్వర రావు, చీకటి రామారావు, రైతు వేదిక పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు, విత్తన డీలర్లు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా నిలిచిన విశ్వనాథపల్లి సర్పంచ్

### కుమార్తె ప్రైవేట్ స్కూల్ నుంచి ప్రభుత్వ బడికి..



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందించేందుకు కారేపల్లి మండలం విశ్వనాథపల్లి గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు తన కుమారూ ఇస్లావత్ రవళిని ప్రైవేట్ పాఠశాల నుంచి విశ్వనాథపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి స్పందించిన సర్పంచ్, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరగాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ విద్యార్థినికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందజేసి, ప్రభుత్వ బడిని ఎంపిక చేసిన సర్పంచ్ ఇస్లావత్ రాజును అభినందించారు. ప్రజాప్రతినిధులే ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తే విద్యావ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

## రైతు వేదికల్లో అవగాహన సదస్సులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలోని రైతు వేదికల్లో విత్తన శుద్ధి కార్యక్రమాలు, రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. కారేపల్లి క్లస్టర్ రైతు వేదికలో వ్యవసాయ అధికారి రైతులకు సబ్సిడీపై అందుబాటులో ఉన్న సన్నరకాల విత్తనాలు వినియోగించుకోవడంతో పాటు పత్తి, మిర్చి, పప్పుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకుడు, దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య రైతులు వర్షాధార పంటలు, పప్పుధాన్యాల సాగు పెంచి ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్త వంగడాల ప్రదర్శనను రైతులు పరిశీలించాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మోతే వీరస్వామి, గ్రామ నాయకుడు ఆవుల సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కారం చేయాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** రైతాంగ సమస్యలు పరిష్కారం చేయాలని, రైతులకు ఇప్పటివరకు ఎలాంటి విత్తనాలు అందించలేదని, వెంటనే విత్తనాలు అందించాలని, పెంచినటువంటి ఎరువుల రేట్లు వెంటనే తగ్గించాలని రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సర్రెడ్డి పుల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మణుగూరు మండల రెవెన్యూ తహశీల్దార్ సీనియర్ అసిస్టెంట్ మాధవి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, ఎడారి రమేష్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు సోందే కుటుంబరావు, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, కోడిమల్ల సుజాత, యాకూబ్, లింగస్వామి శ్రీకాకుళం వీరమల్లు తదితరులు పాల్గొని వినతి పత్రం అందజేశారు.

## సరైన విత్తనం.. సమృద్ధి పంటకు పునాది



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం బట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదికలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, రేగళ్ల సర్పంచ్ బాడిష పార్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం విత్తన మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వివిధ రకాల విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తుల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, అనిల్, రైతులు దుర్గం ప్రేమ్, పోలబోయిన కుమార్, అప్రోచ్, వెంకన్న సాయి సందీప్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఏటా పంట మార్పిడి అవసరం



**ప్రజాపక్షం/ఏన్కూరు:** రైతులు ప్రతి సంవత్సరం పంటలు మార్పిడి చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ అన్నారు. మంగళవారం ఏన్కూరు రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళాను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వేదికల వద్ద వరి, పెసర, మినుములు, కూరగాయాల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు మట్టి పరీక్షలు చేయించి, ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని, ప్రభుత్వం సూచించిన సన్నరకాల విత్తనాలతో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈకార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పావని, ఫణిశ్రీ, మాజీ ఎంపీటీసీ మేడ ధర్మారావు, మండల వ్యవసాయ అధికారి నరసింహారావు, వ్యవసాయ విస్తరణ అధికారులు సపావత్ సైదులు, భూక్య లహరితో పాటు రైతులు పాల్గొన్నారు.

## విజయవంతంగా కొనసాగుతున్న రిలే దీక్షలు

**-సింగరేణి కార్మిక సమస్యలు ఎమ్మెల్యే, ఎంపీలకు పట్టవా?**
**-సింగరేణి అదనపు జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య**



**ప్రజాపక్షం/మణుగూరు:** ఓసి 2 డీప్ సైడ్ బ్లాక్ ను సింగరేణికి అప్పగించాలని, మణుగూరు ఓసి పర్మిషన్ ఎక్స్టెన్షన్ తీసుకురావాలని, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) దీక్షలు రెండో రోజుకు దిగ్విజయంగా నడిచాయి. ముందుగా దీక్షలను సింగరేణి అదనపు జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య ప్రారంభం చేసి ప్రారంభ ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే, ఎంపీలకు పట్టవా అని ప్రశ్నించారు. ఒకప్పుడు సింగరేణి మణుగూరులో వేలాదిమందితో నడిచిందని ఈ ప్రాంత అభివృద్ధి కూడా జరిగిందని,సింగరేణిలో కార్మికులతో పాటు ఈ ప్రాంత ప్రజలు స్కూల్స్ ,వ్యాపార సంస్థలు, హాస్పిటల్స్ ,ఇలా ఒకదానితో ఒకటి పెరుగుతూ అభివృద్ధి చెందాయని కానీ ఉన్న ఒగ్గు బావిలు ప్రైవేటుపరం చేస్తూ ఉన్నవి మూసేసి పరిస్థితి వచ్చినప్పుడు వాటి మీదనే ఆధారపడిన గుమస్తాలు, కోల్ ట్రాన్స్పోర్ట్ , లారీ ఓనర్స్, డ్రైవర్స్, పంచర్ షాపులు, ఎలక్ట్రికల్స్ ఇలా అన్ని రంగాల ప్రజలు సింగరేణి మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, సింగరేణి కేవలం ఉన్నటువంటి చేయాలని ఆలోచన చేస్తున్నారని ఉన్నటువంటి ఓసి కేవలం 2027 వరకు పర్మిషన్ ఉండడంతో సింగరేణి కార్మికుల ఈ ప్రాంత ప్రజల భౌతవ్యం ప్రశ్నార్థకంగా మారబోతుందని దీనికోసం రాజకీయాలకు అతీతంగా కార్మిక ఈ ప్రాంత ప్రజలందరి సమస్యలను కాపాడుకోవాలని దీని కోసం గత 48 గంటలుగా ఏఐటియుసి మణుగూరు పట్టణంలో ఆందోళన చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే దృష్టికి సమస్య పట్ల తీసుకెళ్లిన స్పందించలేదని ఇది సరైన విధానం కాదని ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని వారన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి సింగరేణి కాపాడుకోవడానికి ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సర్రెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ.. సింగరేణి అభివృద్ధి కొరకు ఈ ప్రాంత ప్రజలను కూడా ఒప్పించి అనేక గ్రామాలను సింగరేణి అభివృద్ధికి గొప్ప చెప్పడం జరిగిందని సింగరేణి ఉన్న బ్లాకును ప్రైవేటుపరం చేసి చేతులు దులుపుకోవాలని చూస్తుందని వెంటనే ఈ బ్లాకును సింగరేణి కేటాయించాలని మణుగూరు ఓసి ఎక్స్టెన్షన్ చేసి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఈ ప్రాంతంలో శివలింగాపురం లాంటి గ్రామాల్లో సంవత్సరాలకు తరబడి బొగ్గు ఉందని ఆనాడే సర్వే చేసి చెప్పడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రామ్ గోపాల్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్గాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, తోట రమేష్, గద్దం వెంకటేశ్వర్లు, కోడిమెల్ల సుజాత, బోశెట్టి సంపత్, ఆర్టీసీ మురళి పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వర్, ఉపాధ్యక్షులు ఎంవి రామనరసయ్య, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, శనిగరపు కుమారస్వామి, ఆదర సురేందర్, ఆడెపు రాజశేఖర్, బి. సురేందర్, ఆంగోటి రవి, ఇమాముద్దీన్, నారాయణ, వి. సతీష్, సాయి ప్రకాష్ చారీ, శరత్ తంబళ్ల పూర్ణచందర్, శరత్, సాయి, ఎస్కె. సర్వర్, హుస్సేన్, నాగేశ్వరరావు, మల్లెల కిషోర్ బాబు తదితరులు దీక్షలో కూర్చున్నారు.

## ప్రమాదకరంగా డ్రైనేజీ నీరు..!

**-ఇబ్బందులు పడుతున్న పాఠశాల విద్యార్థులు**
**-పట్టించుకోని పంచాయితీ కార్యదర్శి**
**-విద్యార్థులు, గ్రామస్తులు ఆందోళన**





**ప్రజాపక్షం/కూసుమంచి:** గైగోళ్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని ఉడుతలగూడెం ప్రాథమిక పాఠశాల(పీఎస్ స్కూల్)విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతుండగా, మురుగు నీరు నిల్వ ఉండటం ఇంకా లోతైన సైడ్ డ్రైన్ నిండి ఉండటం భౌతికంగా ప్రమాదంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల పక్కనే సైడ్రైన్ నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు, ఈగలు అధికంగా పెరిగి అంటువ్యాధులకు కారణమవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం గత నాలుగు నెలలుగా పాఠశాలకు తాగునీటి కనెక్షన్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో చిన్నారులు బయట నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలలో చదువుకునే చిన్నారుల ఆరోగ్యం, భద్రత విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉడుతలగూడెం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్డుపైనే ముళ్ల గులకరాళ్లు, పశువుల పెంట, ప్రధాన రహదారిపై ఉండటంతో నిత్యం రాకపోకలకు అంతరాయంగాగ ఇబ్బందికరంగా అసౌకర్యంగా ఉంటుందని, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, చెత్తను సకాలంలో తొలగించకపోవడం వల్ల గ్రామం మొత్తం అపరిశుభ్రత వాతావరణంగా మారిందని అంటున్నారు. ముఖ్యంగా పాఠశాల పరిసరాల్లోనే ఈ పరిస్థితి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే తాగునీటి కనెక్షన్ పునరుద్ధరించాలని, పాఠశాల పక్కన నిల్వ ఉన్న సైడ్రైన్ నీటిని తొలగించాలని, పారిశుద్ధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యపై పలుమార్లు గ్రామ పంచాయితీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పుగా ప్రమాదకరంగా మారిన సైడ్ డ్రైన్ సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## సేవ్ మణుగూరుకు విశేష స్పందన

**ఇంటెలిజెన్సీ నివేదికతో ప్రభుత్వం దృష్టికి చేరిన ఉద్యమం**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు సింగరేణి ఏరియాలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి ఆధ్వర్యంలో చేపట్టిన సేవ్ మణుగూరు రిలే నిరాహార దీక్షలు విజయ విహారంలో విశేష స్పందన పొందుతున్నాయి. జాతీయ బొగ్గు గనుల 2వ దశ వేలం ప్రక్రియ 19 062026 నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో మణుగూరు ఓసి2 సైడ్ డీప్ ఎక్స్టెన్షన్ గనిని సింగరేణికే కేటాయించాలనే డిమాండ్తో సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలకు అన్ని వర్గాల ప్రజల నుండి అపూర్వ మద్దతు లభించింది. దీక్షలకు లభిస్తున్న ప్రజా మద్దతును పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ఇంటెలిజెన్సీ శాఖ ముఖ్యమంత్రి కార్యాలయానికి ప్రత్యేక నివేదిక పంపింది. దీంతో ఈ అంశం ప్రభుత్వ అత్యున్నత స్థాయిలో చర్చకు రావడం గమనార్హం.దీక్షల తొలి రోజు శాసనసభలో సిపిఐ పక్ష నేత, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే సాంబశివరావు మణుగూరుకు విచ్చేసి నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్లనే మణుగూరు ఈ దుస్థితికి వచ్చింది. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. సీఎం దృష్టికి మరోమారు మణుగూరు ప్రజల మనోభావాలను వివరిస్తాను. జాతీయ బొగ్గు గనుల వేలం పాటలో మణుగూరుకు అన్యాయం జరగకుండా న్యాయం జరిగేలా కృషి చేస్తాను అని ఎమ్మెల్యే సాంబశివరావు ఈ సందర్భంగా ప్రకటించారు. మణుగూరు గని సింగరేణికి దక్కకపోతే వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రశ్నార్థకమవుతుందని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అనుమతుల్లేని ఆయుష్‌లపై చర్యలేవీ..?

**-నిరక్షరాసులే వీరి టార్గెట్**
**-రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలు బేఖాతర్**









**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** నగరంలో అనుమతులు లేని ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియో, న్యాచురోపతి, ధన్వంతరీ వైద్యశాల, హెర్బల్ వైద్యం, మొలల ఆసుపత్రులు, నాటు వైద్యం, ముళ్ల ఆసుపత్రులు అనే పేర్లతో అనుమతి లేని క్లినిక్‌లు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. ఇప్పటి వరకు అనుమతులు లేని ఇటువంటి క్లినిక్‌ల వ్యాపారం యథేచ్ఛగా ఖమ్మం నగరంలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయి. ఆయుష్ మందులు మంచిగా పనిచేస్తాయని, ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవనే ప్రచారం చేస్తూ ఉంటారు. దీంతో వివిధ రోగాలతో బాధపడేవారు ఇటువంటి క్లినిక్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. వీరు ఏటువంటి అనుమతులు, అర్హతలు లేకుండా సోషల్ మీడియా యాడ్స్, ప్రధాన కూడళ్లలో పోస్టర్స్, ఇతరత్ర ప్రమోషన్‌లు చేస్తూ ప్రజలను తప్పు దారి వైపు ఆకర్షిస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతిస్తున్నారు. వీరితో పాటు కొంత మంది ఆర్‌ఎంపీలు బహిరంగంగా కామెర్లుకు, కిడ్నీ సంబంధిత వ్యాధులకు ప్రత్యేక వైద్యం అందిస్తామని పెద్ద పెద్ద బోర్డులను నగరంలో ప్రదర్శిస్తున్నారు. ఆయుష్ ఆసుపత్రులను నిర్వహించాలన్న సంబంధిత వైద్య డిగ్రీ పట్టాలను కలిగి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం వైద్య ఆరోగ్య శాఖ వద్ద అనుమతులు తీసుకోవాలి. అయితే క్లినిక్‌లు, డెంటల్ ఆసుపత్రులు, ఫిజియోథెరఫీ కేంద్రాలు, ఆయుష్ ఆసుపత్రులు అనుమతులు లేకుండానే ఏర్పాటు చేస్తున్నారు. ఇటు వైపుగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వీరి ఆగడాలు మరింత పెట్రేగిపోతున్నాయి. వీటిపై ఆరోగ్యశాఖ నుంచి సరైన పర్యవేక్షణ ఉండటం లేదు.

**-అనుమతి లేని పైల్స్ ఆస్పత్రి ఆగడాలు?**

పాత బస్టాండ్ ఎదురుగా నిర్వహిస్తున్న కృష్ణ పైల్స్, సాయిబాబా క్లినిక్ రకరకాల పేర్లతో నిర్వహించే ఆస్పత్రిలో అర్హత కలిగిన వైద్యులు లేకపోయినా వైద్యసేవలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీన ప్రాంతాల నుంచి వచ్చే రోగుల వద్ద వేలాది రూపాయలు వసూలు చేస్తూ చికిత్స పేరుతో మోసాలు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అర్హత లేని వైద్యసిబ్బందితో చికిత్సలు చేయించడం వల్ల పలువురు రోగులు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నట్లు సమాచారం. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి ఆస్పత్రులు ఖమ్మం నగరంలో యథేచ్ఛగా వ్యవహరిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టి, వాస్తవాలను వెలికితీసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**-నిమ్మకునీరెత్తినట్లు జిల్లా వైద్య యంత్రాగం**

సరైన అనుమతులు, అర్హతలు లేకుండా నిర్వహిస్తున్న ఆయుష్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల ఆదేశించారు. ఆయుర్వేద, హోమియోపతి పేరిట ఆస్పత్రులు, క్లినిక్‌లు నడిపిస్తూ, తప్పుడు ప్రకటనలతో ప్రజలను దోచుకుంటున్న వారిని వదిలిపెట్టొదని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఖమ్మం వైద్య, ఆరోగ్య శాఖ యంత్రాగం నిమ్మకినీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. అనుమతులు, అర్హతలు లేకుండా వివిధ పేర్లతో నిర్వహిస్తున్న క్లినిక్‌లు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అనధికార క్లినిక్‌లు, అర్హత లేని వ్యక్తులు వైద్యసేవలు అందిస్తూ ప్రజల ప్రణాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్యశాఖ స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## హక్కుల కోసం సంఘటిత పోరాటం చేయాలి

**-అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు ఏఐటీయూసీ పిలుపు**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బూర్గంపాడు ప్రాజెక్టు మహాసభ సారపాకలోని ఏఐటీయూసీ కపర్తి భవనంలో జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారాటి ప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు తమ హక్కుల సాధన కోసం సంఘటితమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ సిబ్బందికి కనీస వేతనం రూ 18వేలు నిర్ణయించాలని, బీఎల్ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే గతంలో పలు సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈసందర్భంగా బూర్గంపాడు ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జీవీ రమణ, సలహాదారుగా పేరాల శ్రీనివాసరావు, అధ్యక్షురాలిగా కొరిం శ్రీలత, ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి మంగ, ప్రధాన కార్యదర్శిగా భూక్య రచన, సహాయ కార్యదర్శులుగా విజయ, సరోజిని, జ్యోతి, కోశాధికారిగా సరోజ, కార్యవర్గ సభ్యులుగా కొమరం లత, కడారి రమాదేవి, భాగ్యమ్మ, నాగవేణి ఎన్నికయ్యారు. మహాసభలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నాయకులు రెడ్డి అరుణ, శ్రీదేవితో పాటు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులపై దాడి చేస్తే గనులు స్తంభిస్తాయి..



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి సంస్థలో కార్మికుల సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నా యాజమాన్యం, ప్రభుత్వాలు వాటి పరిష్కారంపై చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని, కార్మికుల హక్కులను కాలరాస్తూ సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మార్చే విధానాలను ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం సెంట్రల్ వర్క్ షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ దేశానికి బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో రాజకీయ జోక్యాలు, కార్మిక వ్యతిరేక విధానాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘంగా ఉన్నప్పటికీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే ఏఐటీయూసీ 31 ప్రధాన డిమాండ్లపై సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. కార్మికుల హక్కులు, సింగరేణి భవిష్యత్తు, సంస్థ అభివృద్ధి కోసం ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందని, సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెతోపాటు మరింత ఉధృతమైన ఉద్యమాలకు కార్మిక లోకం సిద్ధంగా ఉందని రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, ఉపాధ్యక్షులు క్రిస్టఫర్, సహాయ కార్యదర్శి రాము, పిట్ కార్యదర్శి నరేష్, నాయకులు నాగయ్య, నరసయ్య, మల్లయ్య, రాజేశ్వరరావు, రవీందర్, కందేలింగం, ఆనందరెడ్డి, మురళి, అనిల్, రాజగోపాల్, రవి, శశికిరణ్, దేవేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌పై అవగాహన



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** యువత మత్తు పదార్థాలను దూరంగా ఉండాలని మంగళవారం ఆళ్లపల్లి హనుమాన్ సెంటర్‌లో స్థానిక ఎస్ఐ ఎం సోమేశ్వర్ యువతకు అవగాహన కల్పించాలని, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను ఆయన వివరించారు. మత్తు పదార్థాల నియంత్రణలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పెద్దలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. మత్తు పదార్థాలు వాడిన అమ్మిన చట్టరీత్యా నేరమని, డ్రగ్స్ కేసుల్లో కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. ఈకార్యక్రమంలో యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్ కుటుంబానికి భరోసా



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ భజన మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ 1.60లక్షల కుటుంబ భరోసా చెక్కును మంగళవారం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పంపన రమేష్ చేతుల మీదుగా మల్లయ్య సతీమణికి చెక్కును అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా మూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శి పూదోట విజయ్, బూర్గంపాడు మడలం అధ్యక్షుడు దాసరి బాలకృష్ణ, మండల కార్యదర్శి రమణారెడ్డితో పాటు మండల ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## నూతన కనీస వేతనాలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన నూతన కనీస వేతనాలను ఐటీసీ పీఎస్‌పీడీ భద్రాచలం యూనిట్‌లో వెంటనే అమలు చేయాలని రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఐటీసీ యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నెంబర్ 6 ప్రకారం కొత్త కనీస వేతనాలు 1 జూన్ 2026 నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపారు. పాత వేతన నోటిఫికేషన్లు రద్దు అయిన నేపథ్యంలో ఐటీసీ యూనిట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, బదిలీ కార్మికులకు కూడా కొత్త వేతనాలు వర్తింపజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఐటీసీ విభాగ అధ్యక్షుడు గోనే రామారావు, కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

## భూదందాలకు కొమ్ము కాస్తున్నది ఎవరు..?




**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల కేంద్రంలోని మల్లారం సరిహద్దుల్లో సర్వే నెంబర్ 589/బి పరిధిలో ఉన్న పలు ఎకరాల భూములు అక్రమ కబ్జాలకు గురయ్యాయని, భూదందాలకు ఎవరు అండగా నిలుస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ డిమాండ్ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సొంత స్థలం ఉన్నవారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేయడం జరుగుతోందని, అయితే గ్రామంలో సెంటు భూమి కూడా లేని నిరుపేద కుటుంబాలు అనేకం ఉన్నాయని పార్టీ నాయకులు పేర్కొన్నారు. నిజమైన పేదలకు ప్రభుత్వం స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. అక్రమ కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుని, ఇల్లు లేని పేదలకు పంపిణీ చేస్తే ప్రభుత్వం సామాజిక న్యాయం చేసినట్టవుతుందని అభిప్రాయపడ్డారు. భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని, పేదల గృహ హక్కులను కాపాడాలని కోరారు. ప్రభుత్వం స్పందించిక పోతే కబ్జా భూముల అంశంపై ప్రజా ఉద్యమం చేపడతామని, నిరుపేదల భూ హక్కుల కోసం సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు హెచ్చరించారు.

## గాలిదుమారానికి దెబ్బతిన్న పామాయిల్ తోటల పరిశీలన



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరు మండల కేంద్రంలో ఇటీవల గాలిదుమారానికి నేలమట్టమైన పామాయిల్ తోటలను వైరా ఉద్యానవన అధికారి వేణు, కేవీకే శాస్త్రవేత్తలు పావని, ఫణి శ్రీ మంగళవారం పరిశీలించారు. రైతులు ఆది పూర్ణయ్య, మేడ ధర్మారావు పామాయిల్ తోటల్లో దెబ్బతిన్న మొక్కలను పరిశీలించిన అధికారులు, మొక్కలను రెండు అడుగుల మేర లేపి గుంటలు తవ్వి ట్రాక్టర్, జేసీబీ సహాయంతో తిరిగి నిలబెట్టి పూడ్చాలని సూచించారు. అలాగే పొటాష్, డీఏపీ ఎరువులు వేయడంతో పాటు మొక్కలకు తగినంత నీటి తడి అందించాలని రైతులకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు, మాదినేని లెనిన్, కొవ్వూరి నాగేశ్వరరావు, ముదిగొండ నరసింహారావు, జాస్తి జనార్ధన్, నన్నే ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# 30న జరిగే రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయండి



**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

**ప్రజాపక్షం /ఖమ్మం టౌన్ :** ఈ నెల 30 న చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేయుచున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని నాయకులకు తగు సూచనలు చేశామన్నారు. అదే విదంగా మదిర నియెజకవర్గం చింతకాని మండలం నుండి 9 వేల కోట్ల రుపాయలు రైతు భరోసా నిదులు విడుదల చేయనున్నారని, ఖమ్మం జిల్లా నుండి నిదులు విడుదల చేయటం మన జిల్లా రైతాంగానికి గర్వకారణమన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, రైతు సోదరులు అదిక సంఖ్యలో పాల్గోని ఈ సభను జయప్రదం చేయాలన్నారు. అదే విదంగా జన సమీకరణకు నియెజకవర్గాల, మండలాల వారీగా ఇంచార్జిలను నియమిస్తామని అయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ శాసన మండలి, శాసన సభ్యులు బాలసాని లక్ష్మి నారాయణ, కోండభాల కోటేశ్వరావు, గిడ్డంగుల సంస్త చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, అనుబంద సంఘ అద్యక్షులు సయ్యద్ గౌస్, మెక్కా శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం తదితరులు పాల్గోన్నారు.

# రైతుల సమస్యలపై పోరాటం కొనసాగిస్తాం



**- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రైతులకు ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట రైతు సంఘం(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులకు ఇబ్బందికరంగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఖరీఫ్ రైతు భరోసా నిధులను ఒకే దఫాలో విడుదల చేయాలని, పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలన్నారు. అలాగే మార్కెట్‌లో విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టాలని అన్నారు. రెంప లక్షల రూపాయలకు పైబడిన వ్యవసాయ రుణాలను కూడా మాఫీ చేయాలని కోరుతూ పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ వినయేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సమితి సభ్యులు బానోత్ రాంకోటి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడ్లపల్లి శంకరయ్య, పాసంగుల చంద్రావు, ఏలూరి భాస్కర్‌రావు, వెన్నం భాస్కర్‌రావు, మామిడి సుదర్శన్‌రెడ్డి, మండల నాయకులు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, గణపరపు నాగయ్య, గూడా బాబురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు ఉపేందర్, గంధం రవి, భూక్యా నాగరాజు, అబుబకర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు గోకినపల్లి మస్తాన్ తెలిపారు. మంగళవారం సిపిఐ (ఎంఎల్) ఎన్డి కార్యాలయంలో పిడిఎస్‌యు ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగాన్ని వ్యాపారంగా మార్చిందన్నారు. ఖమ్మంలో అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తూ బుక్స్, అడ్మిషన్ల పేరుతో వేలాది ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు మాత్రం ప్రైవేటు పాఠశాలలను సందర్శించకుండా కార్యాలయాలకే పరిమితం అవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని కోరారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించని యెడల ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, విశ్వంత్, కార్తీక్, రాజేష్, అసాత్, ఉదయ్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతిప్రణాళిక నిరంతర ప్రక్రియగా కొనసాగాలి

**- శాఖాల వారీగా ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించాలి**

**- జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన ప్రత్యేకాధికారి శ్రీధర్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాపాలనప్రగతి ప్రణాళిక నిరంతరం ప్రక్రియగా కొనసాగాలని జిల్లా ప్రత్యేకాధికారి శ్రీధర్ అన్నారు. జిల్లాలో జరిగిన కార్యాచరణపై మంగళవారం ఐటిడిఓసిలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై వివరించారు. ప్రజావాణి, గ్రామసభల ద్వారా అందిన 16549 దరఖాస్తుల్లో 11309 పరిష్కరించగా, మిగిలినవి పరిష్కార దశలో ఉన్నాయన్నారు. గృహనిర్మాణం, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు, కొత్తరేషన్ కార్డుల మంజూరు, రైతు భరోసా, రైతు బీమా, రుణ మాఫీ, ధాన్యం గణనీయంగా పురోగతి సాధించిందన్నారు. అటవీశాఖ చేపట్టిన ప్లాంటేష్, వెదురు సాగు ప్రోత్సాహం, గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను జిల్లా అటవీ అధికారి కృష్ణ గౌడ్ వివరించారు. ఐటిడిఏ పిఓ రాహుల్ గిరిజన సంక్షేమం, జీవనోపాధి, విద్య, వైద్యం రంగాల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలు వివరించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట గోదావరి నదితీర పునరుద్ధరణ కార్యక్రమం ద్వారా సాధించిన ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి శ్రీదర్ జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రతీశాఖా తమ కార్యక్రమాలపై ఫొటోలతో కూడిన బిఫోర్ అండ్ ఆఫ్టర్ నివేదికలు సిద్ధం చేసి ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించాలని ఆదేశించారు.

# సెంటు స్థలం ఆక్రమించినా స్వాధీనం చేసుకోండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మా పరిధి దాటి సెంటు స్థలం ఆక్రమించినా స్వాధీనం చేసుకోవచ్చని ధీరావత్ పుష్పావతి పేర్కొన్నారు. మండల పరిధిలోని మంగాపురం తండా గ్రామంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. తమ పొలంలో ప్రహారీగోడ నిర్మాణం చేస్తున్నామని, రహదారి ఆక్రమణ చేస్తున్నారని కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో కొంతమంది రహదారిపై 10గేదెలను కట్టేస్తున్నారని, తాము ఇబ్బంది పడుతున్నామని ప్రశ్నించినందుకు తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాధు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, రహదారి నిర్మాణం చేస్తామంటే తాము రహదారికి స్థలం ఇవ్వడానికి సిద్దంగా ఉన్నామని, ఎవరికీ నష్టం చేసేవాళ్లం కామని, రహదారిపై గేదెలను కట్టేసేవాళ్లపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్, డీపీఓలకు ఫిర్యాధు చేసినట్లు తెలిపారు.

# హరీష్‌రావుకు ఘన స్వాగతం పలికిన సండ్ర



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బిఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అశ్వారావుపేట పర్యటనకు వెళ్తున్న సందర్భంగా సత్తుపల్లిలో ఆయనకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఘన స్వాగతం పలికారు. మంగళవారం సత్తుపల్లికి చేరుకున్న హరీష్‌రావును సండ్ర వెంకట వీరయ్య పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కూసంపూడి మహేష్, వీరపనేని రాధికబాబి, కొత్తూరు తులసి ఉమామహేశ్వరరావు, బెల్లంకొండ రాము, మహేంద్ర బాషా, బొడ్డు శివబాబు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్ రావు, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, రఫి, రామిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వరుస దొంగతనాల ముఠా గుట్టు రట్టు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** వరుస చోరీలకు పాల్పడ్డ ముఠా గుట్టు రట్టు చేశారు వీఎం బంజర పోలీసులు. పెనుబల్లి మండలంలో ఇటీవల వరుస దొంగతనాలతో హడలెత్తించిన దొంగల ముఠాను వీఎం బంజర పోలీసులు పట్టుకున్నారు. ఏసిపి వసుంధర యాదవ్ పర్యవేక్షణలో సిఐ ముత్తిలింగం ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో కలిసి దొంగల ముఠా కోసం వేటను ప్రారంభించారు. గట్టినిఘాతో చాకచక్యంగా వ్యవహరించి మాణికల వసంతరావు, మాణికల రమేష్, పొన్నూరు కోటేశ్వరరావు, తుమ్మల శేఖర్, పొన్నూరు రాంబాబులు యానాది గ్యాంగ్ గా ఏర్పడి వరుస చోరీలకు పాల్పడుతున్నారని ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. ఈ ముఠా ఆంధ్ర, తెలంగాణలలో పలు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. పెనుబల్లి మండలంలో వీఎం బంజర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంకపల్లి, అడవి మల్లెల, ఏలూరు జిల్లా చాట్రాయి పోలీస్ స్టేషన్, వేంసూర్ పోలీస్ స్టేషన్, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలలో నగదు, బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలను చోరీలకు పాల్పడినట్లు ఏసిపి వసుంధర యాదవ్ వివరించారు. ఈ యానాది గ్యాంగ్ ముఠా కు గతంలో పలు దొంగతనాల కేసులలో నిందితులుగా ఉన్నారని నిందితులను సత్తుపల్లి కోర్టుకి తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# విత్తనాలపె రెతులకు అవగాహన అవసరం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** విత్తనాలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కూసుమంచి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు మిట్టపల్లి సతీశ్, మండల వ్యవసాయ అధికారి శ్రీనారెడ్డి సీతారామరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లోని రైతువేధికలో మంగళవారం రైతులకు విత్తనమేళ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించిన సన్నరకాలైన వడ్లు బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరాం, డబ్ల్యూఎల్44, 962 రకాల గురించి వివరించారు. రైతులు ఒక్క యూరియాపైనే కాకుండా నానో యూరియా,డీఏపీలు పిచికారీ చేసి ఎరువుల ఖర్చులు తగ్గించుకుని మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

# సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా రామారావు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా రాజారాంపేట సర్పంచి రాయపూడి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటైన సమావేశంలో సర్పంచుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గరిడేపల్లి సుజాత(సుర్ధేపల్లి), అశోకరాణి(మంగాపురంతండా), ప్రధానకార్యదర్శిగా పవన్(రామచంద్రాపురం), కార్యదర్శులుగా రావెల్ల జ్యోతి(గువ్వలగూడెం), బోయిన వేణు(రాయగూడెం), కుక్కల నరేశ్(పైనంపల్లి), కోశాధికారిగా తేజావత్ శివాజీ(అజయ్‌తండా), కార్యవర్గసభ్యులుగా విశాల, పొట్టలక్ష్మీ , బొడ్డు రాంబాబు, గుండపనేని లక్ష్మ ణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/ముదిగొండః** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ మురళి కోరారు. పోలీస్ కమీషన్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరైన మార్గంలో పయనిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం, చదువు, భవిష్యత్ దెబ్బతింటాయని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన ప్రతి గ్రామం, వార్డు, పాఠశాల, కుటుంబం నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండడంతో పాటు, వాటి గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# యూరియా కోసం బుకింగ్ తప్పనిసరి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రతీ రైతు యూరియా కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో బుకింగ్ తప్పనిసరి అని సొసైటీ ఛైర్మన్ తీగ రమణయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు బుకింగ్ చేసుకుని రూ.266లకే యూరియా పొందొచ్చని, దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. రైతులకు సరిపడా యూరియాను అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కనకబండి కృష్ణంరాజు, సీఈఓ ఖమ్మం వెంకటేశ్వర్లు, కనకపర్తి నాగేందర్, డైరెక్టర్లు, రైతులు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుబంధుకు రూ.73కోట్లు ఇచ్చింది కెసిఆర్



**- రేవంత్‌రెడ్డి రూ.29కోట్లు రైతులకు ఎగ్గొట్టారు**
**- ఖమ్మంలో ముగ్గురు మంత్రులు చేసిందేమీ లేదు**

ప్రజాపక్షం/అశ్వారావుపేట: రైతులకు రైతుబంధు రూ.73కోట్లు ఇచ్చింది కేసీఆర్‌అని, రేవంత్‌రెడ్డి రూ.29కోట్లు రైతుబంధు ఎగ్గొట్టారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. నియోజకవర్గంలోని శ్రీశ్రీ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ ఇంఛార్జీ మచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటైన సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ చేసిందేమీ లేదని, కాళేశ్వరం కట్టింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమని, స్విచ్‌ఆన్ చేయలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. మహిళలను లక్షాధికారి చేస్తామన్నారని, లక్షాధికారి వద్దులేగాని ఒక్కో మహిళకు ఇవ్వాల్సిన రూ.75వేలు బకాయి చెల్లించాలని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ అని,ఆ ప్రాజెక్టుకు కనీసం స్విచ్‌ఆన్ చేయలేని చేతగాని ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమని ఆరోపించారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి గోదావరి జలాలు రావాలంటే కేసీఆర్ రావాలని, రానున్న ఎన్నికల్లో మొదట గెలవాల్సింది ఖమ్మంలో కాదు అశ్వారావుపేటలో అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, నాయకులు తాటి వెంకటేశ్వర్లు, కాసాని చంద్రమోహన్, మురళి హహిపాల్, సీతారామస్వామి, మాజీ జడ్‌పీటీసీ రమణారావు, మోహన్‌రెడ్డి, మల్లిఖార్జునరావు, జజ్జురపు శ్రీరామ్మూర్తి,తగరం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానవాటికకు చెత్త కుప్ప నుంచి విముక్తి..!




**-ప్రజాపక్షం కథనానికి స్పందించిన అధికారులు**
**-పోకలగూడెం శ్మశాన వాటిక పరిశుభ్రం**
**-హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**


శ్మశానవాటికలోనే చెత్త డంపింగ్..!

ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని శ్మశాన వాటికలో చెత్త డంపింగ్ కారణంగా నెలకొన్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సోమవారం "శ్మశాన వాటికే చెత్త కుప్ప" శీర్షికతో ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనం జిల్లా యంత్రాంగం, స్థానిక అధికారులను కదిలించింది. కథనంపై వెంటనే స్పందించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. గత ఏడాదిన్నర కాలంగా గ్రామంలో సేకరించిన చెత్తను శ్మశాన వాటిక పరిసరాల్లో డంప్ చేయడంతో అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహ చెత్త, కుళ్లిపోయిన వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. అంత్యక్రియలకు వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేయగా, ఈవిషయంపై ప్రజాపక్షం ప్రజల ఆవేదనను వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో కథనం ప్రచురితమైన వెంటనే పంచాయితీ సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి, ఎంపీడీఓ వెంకన్న స్పందించారు. శ్మశాన వాటిక పరిసరాల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జేసీబీ,ట్రాక్టర్లు, సిబ్బంది సహాయంతో చెత్తా చెదారాన్ని పూర్తిగా తొలగించి శ్మశాన వాటికను పరిశుభ్రంగా మార్చారు. ప్రజా సమస్యలను ప్రజాపక్షం వెలుగులోకి తీసుకురావడం, అధికార యంత్రాంగం స్పందించి పరిష్కారం చూపడం అభినందనీయమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# విబిజి రాంజీ విధానాన్ని రద్దు చేసి ఎన్‌ఆర్ఇజియస్‌ను పునరుద్ధరించాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పని లో విబిజి రాంజీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, ఉపాధి కార్మికుల హక్కులను కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ప్రధాన కార్యదర్శి కేసు ఎల్లయ్య, అధ్యక్షులు వీశంశెట్టి పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను పాల్పడుతున్నారని, ఎన్ఆర్ ఇజిఎస్ పథకాన్ని పునరుద్ధరించి పటిష్టంగా అమలు చేయాలని, ఏటా వంద రోజులు కా కుండా 200లరోజుల పనిదినాలు కల్పించి దినసరి వేతనం రూ.700 చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కార్మికుడు అంగవైకల్యం పొందినా, మరణించినా రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, పనిప్రదేశాల్లో మౌళిక సదుపాయాలు నీడ, తాగునీరు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు, ఏఐకెఎస్, సిపిఐ నాయకులు ఎస్‌కే సలీం, ముత్యాల విశ్వనాథం, సప్పు నాగేశ్వరరావు, కొమరం హనుమంతరావు, వేములపల్లి శ్రీను, పద్మజ, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటేశ్వర్లు, అజ్మీర శ్రీనివాస్, వాడే లక్ష్మీ , బానోత్ రవి, భూక్యా బిక్కూలాల్, వజ్జా రాజేశ్వరి, శనగారపు శ్రీనివాసరావు, దినేష్, నామప ండు, గిరి పాల్గొన్నారు.

# యువత ఆర్థికంగా ఎదగాలి



ప్రజాపక్షం/వైరా: వైరా ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో టీస్టాల్‌ను మంగళవారం వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చిరు వ్యాపారుల అభివృద్ధికి చేయూతనిస్తుందని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎస్‌ఎం వెంకటేశ్వరరావు, టీస్టాల్ నిర్వాహకుడు రావుల మురళి, రజిని, పోలూరు సైదులు, గుత్తికొండ ఎర్రబాబు, దేవిడ్‌రాజ్, మేకల రవి పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో వినియోగిస్తున్న ఫిట్‌నెస్ లేని బస్సులపై తగిన చర్యలు తీసుకోవాలని, లైసెన్సు లేని డ్రైవర్లను తక్కువ జీతాలకు నియమించుకుని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వర్మ అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా రవాణాశాఖాధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిమితి కంటే ఎక్కువ మొత్తంలో విద్యార్థులను బస్సుల్లో కుక్కి ప్రమాదాలకు గురిచేస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యా సం. ప్రారంభమైనప్పటికీ కూడా ఇంకా ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన మొత్తం 254 బస్సులు మాత్రమే ఆర్‌టిఏ అధికారుల వద్ద ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకున్నాయని, మిగిలిన 98 బస్సులు ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాల్సి ఉన్నాయని అన్నారు. వీటిపై రవాణా అధికారులు దృష్టి సారించాలని, ఇన్సురెన్స్, పొల్యూషన్ పత్రాలు ఉండే విధంగా చూడాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుని బస్సులను సీజ్ చేయాలన్నారు. బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు తక్షణే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఇనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి విజయ్, నాయకులు కళ్యాణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు

ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వించే వైటిసి ద్వారా ఉచిత శిక్షణను అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఐటిడిఏ పిఓ రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం కంప్యూటర్ బ్యాచ్ 1 లో, బ్యూటీషియన్ బ్యాచ్ 2లో సీట్లు మాత్రమే మిగిలున్నాయని తెలిపారు. 18 నుండి 33 సం. కలిగిన యువతీ యువకులకు ఉచిత భోజన, వసతి సదుపాయాన్ని అందించి శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని జూలై 6లోగా వైటిసి శిక్షణ కేంద్రానికి నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 7993102529 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



ప్రజాపక్షం/కూసుమంచి: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి తెలిపారు. మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించారు. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన బిపిటి 5204, హెచ్‌ఎంటీ సోనా, కేఎన్‌ఎం 1638, కేఎన్‌ఎం 7715 సన్నరకాల వరి విత్తనాలతో పాటు, పెసర, కంది విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. ఈసందర్భంగా రామడుగు వాణి మాట్లాడుతూ ధృవీకరించిన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని, అపరాల పంటల సాగుతో భూసారం, రైతుల ఆదాయం పెరుగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో విత్తన మేళా ప్రారంభం



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి, జగన్నాథపురం రైతు వేదికల్లో మంగళవారం విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం సూచించిన ఏడు సన్నరకాల వరి విత్తనాలు, కంది విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచగా, రైతులు ఒకే చోట నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేశారు. ఈసందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు(ఏడీఏ)రవికుమార్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం సూచించిన వరి వంగడాలను సాగు చేయాలని, ఎల్‌నినో ప్రభావంతో వర్షాపాతం తగ్గే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. పత్తిలో అంతర పంటగా కంది సాగు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు, జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ మాట్లాడుతూ రైతు వేదికల్లో ఇకపై యూరియా, విత్తనాలు అందుబాటులో ఉంటాయని, ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పని సరిగా పూర్తి చేయాలని కోరారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఒకే చోట అందుబాటులో ఉంచడం అభినందనీయమని తెలిపారు. ఈకార్యక్రమంలో రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, కమలాపురం సర్పంచ్ వగ్గెల రాధ, ఏఈఓలు రమేష్, రాహుల్, సుజాత, సూరిబాబు, ప్రజాప్రతినిధులు, రైతులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# ఇసుక క్వారీపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/పినపాక: రామానుజవరం ఇసుక క్వారీ నిర్వాహకులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏడూళ్లబయ్యారం క్రాస్ రోడ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంబాయిగూడెం వద్ద మణుగూరు, ఏటూరునాగారం ప్రధాన రహదారిపై ఇసుక లారీలు నిలిపివేయడంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. ట్రాఫిక్ కారణంగా గడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సకాలంలో వైద్యం అందక మృతి చెందగా, ఓ విద్యార్థిని నీట్ పరీక్షకు సమయానికి చేరుకోలేకపోయిందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ప్రధాన రహదారులపై ఇసుక లారీలు నిలిపివేయకుండా పోలీసు, రవాణా శాఖలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి గాంధీ, దాట్ల వాసుబాబు, పొనుగోటి భద్రయ్య, రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, బత్తుల వెంకటరెడ్డి, చెన్న కేశవులు, షేక్ జాంగీర్, బూర రమేష్, పడిగె అశోక్, గణేష్ పాల్గొన్నారు.

# ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో వాహనాల తనిఖీలు



ప్రజాపక్షం/పినపాక:పినపాక మండల పరిధిలోని ఈ బయ్యారం క్రాస్ రోడ్ వద్ద మంగళవారం పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల అమలును పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు అవగాహన కల్పిస్తూ రోడ్డు భద్రతా నియమాలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. ప్రజల భద్రత కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. వాహనదారులు అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని పోలీసులు సూచించారు.

# పాముకాటుకు గురైన పారిశుద్ధ్య కార్మికుడు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు బొల్లిపోగు నాగేశ్వరరావు పాముకాటుకు గురై వైరాలో ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరావు, హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

# గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

-వరద నీటి కాలువల నిర్మాణానికి నిధుల కోసం విజ్ఞప్తి

-కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల లేఖ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గంలోని రఘునాథపాలెం మండలంలో ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీలకు వరద నీటి కాలువలు, డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం కోసం రూ. 110 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ ద్వారా తెలిపారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లు కలిసి లేఖను అందజేశారు. మండలం లోని డ్రైనేజీ సమస్య గురించి లేఖలో మంత్రి వివరించారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 28 ఏజెన్సీ గిరిజన ప్రాంతాల పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. సరైన వరద నీటి కాలువలు లేక వర్షాకాలంలో ఈ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థలకు సంబంధించి డిపిఆర్ సిద్ధం చేసి నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు రూ.110 కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన తన నియోజక వర్గ పరిధిలోని ఈ గిరిజన ప్రాంతాలకు సరిపడ స్థానిక వనరులు లేనం దున గ్రామీణాభివృద్ధి లేక గిరిజన ప్రాంత అభివృద్ధి పథకాల ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు. డిపిఆర్‌తో పాటు గ్రామ పంచాయతీల జాబితాను లేఖకు జత చేస్తూ నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు.

# భద్రాద్రి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు ఊపిరి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి మరో సారి ఆశలు చిగురించాయి. ఇప్పటికే ప్రతిపాదించిన రెండు స్థలాలు అను కూలం కాదని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త స్థలాన్ని గుర్తించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తర పున మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కేంద్ర విమానయానశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కలిసి ఎయిర్ పోర్టు నిర్మాణంపై చర్చించారు. కొత్తగా ప్రతిపాదించిన స్థలంపై ఫీజిబిలిటీ అధ్యయనం పూర్తి పదిరోజుల్లో నివేదికలు పంపాలని కేంద్రమంత్రి అధికారులను ఆదేశించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయానికి లక్షలాది మంది భక్తులకు, జిల్లాలోని సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్, ఐటిసి పిఎస్‌పిడి వంటి పరిశ్రమలకు విమానాశ్రయం ఏర్పాటుతో పర్యా టక, పారిశ్రామిక, విద్యా రంగాల అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందన్నారు. ఎయిల్ పోర్టుకు అవ సరమైన భూ సేకరణ, మౌళిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుం దని తెలిపారు. ఇదే సమయంలో వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయానికి జూలైలో శంకుస్థాపన నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహ్ నాయుడు వెల్లడించారు.

# సింగరేణి చీకటి మయంగా మారిపోతోంది : హరీష్‌రావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సిరుల వెలుగులు కురిపించిన సింగరేణి నేడు చీకటి మయంగా మారిపో తోందని, కాంగ్రెస్ హాయంలోని ఈ రెండున్నరేళ్లలో సంస్థ స్కామ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మాజీ మంత్రి, సిద్ది పేట ఎంఎల్ఎ తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. సింగ రేణి పరిరక్ష పేరుతో మంగళవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మా రిందని, సంస్థను దివాలా తీయించేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. ప్రత్య క్షంగా పరోక్షంగా 1 లక్ష మంది కార్మికులు సింగరేణి సంస్థపై ఆధార పడి బ్రతుకుతున్నారని, కాంగ్రెస్ విధానాలతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారే ప్రమాదం ఉందని మండిపడ్డా రు. సంస్థకు మూలాధా రమైన కార్మికుల పొట్టగొట్టేందుకు పూనుకోవడం మంచిపద్ధతి కాద న్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం మితిమీరిపోతోందని, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కూడా ప్రభుత్వం ఏ నాడూ సింగరేణి వ్యవహా రాల్లో తలదూర్చలేదన్నారు. సైట విజట్ పేరుతో సింగరేణిని నష్టాల బాట పట్టిస్తున్నారని, సైట్ విజిట్ చేసినప్పటికీ కొంద రికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ముఖ్యమంత్రి సమీప బంధువులకు ఇచ్చి టెండర్లలో పాల్గొనే లా పావులు కది పారని, ఇది తప్పుకాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత సింగరేణి స్కామ్‌ల మయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల కక్కుర్తితో సంస్థను నిలువునా దోచు కుంటున్నారని, దీనిని బిఆర్ఎస్ చూ స్తూ ఊరుకోదని, సంగరేణికి గుండెకాయ అయిన కార్మికుల పక్షాన ఉండి తీరుతామని చెప్పారు. రాబో యే రోజుల్లో సింగరేణి పరిరక్షణ కోసం దశలవారీ పోరాటాలు సాగిస్తామని, సంస్థ మనుగడకు బిఆర్ ఎస్ కట్టుబడి ఉందన్నారు. పలు అంశాలపై మాజీమంత్రి పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, తాతా మధు, మాజీలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వ రరావు, హరిప్రియతో పాటు తక్కెళ్లపల్లి రవీంద్రరావు, రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, టిబిజికెఎస్ అధ్యక్షులు రాజారెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వం సూచించిన వరి రకాలు సాగు చేయాలి



ప్రజాపక్షం/రఘునాథపాలెం : ప్రభుత్వం సూచించిన వరి రకం విత్తనాలను మాత్రమే రైతులు సాగు చేయాలని ఖమ్మం జిల్లా ఆత్మ పిడి సరిత తెలిపారు. మంగళవారం రఘునాథపాలెం రైతు వేదిక నందు నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో ఆత్మ పిడి సరిత, ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రైతులకు విత్తనా లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటకు సంబంధించి బోనస్ కొరకు రైతులు ప్రభుత్వం సూచించిన రకాలను మాత్రమే సాగు చేయాలని తెలిపారు. భూసారం దెబ్బతినకుండా వాతావరణం కాలుష్యం కాకుండా ఉండేందుకు నానో యూరియా, నానో డిఏపి వంటి ఎరువులను పిచికారి చేయాల న్నారు. రైతులకు కూడా పెట్టుబడులు తగ్గుతాయని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని అపరాలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీడ్ కార్పోరే షన్ డివిజనల్ మేనేజర్ బి. రఘు, మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, మండల ఉద్యానవన అధికారి నగేష్, ఏఫ్‌టిసి వ్యవసాయ అధికారి అరుణజ్యోతి, సాంకేతిక వ్యవసాయ అధికారులు పవన్‌కుమార్, రాంబాబు, ప్రత్యూష, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# విత్తనమేళాను సద్వినియోగం చేసుకోవాలి

- విత్తనమేళాను ప్రారంభించిన కలెక్టర్



ప్రజాపక్షం/పాల్వంచ : రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నెల 23వ, తేదీ మంగళవారం నుండి 30 వరకు ప్రతీ మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాను రైతులు సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలె క్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మండల పరిధి జగన్నాధపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్ళను పరిశీలించారు. విత్తనాల ప్యాకె ట్లపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేసి వాటి నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించటానికి వ్యవసాయశాఖ విస్తృతమైన ఏర్పాట్లు చేసింద న్నారు. రైతు వేదికలో నిర్వహిస్తున్న విత్తన మేళాలో సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఏపి వంటి ఆధునిక వ్యవసాయ ఉత్ప త్తులుకూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లాలోని 43 రైతు వేదికల ద్వారా విత్తనమేళాను ర్పాటు చేశామని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టినట్లు తెలి పారు. నకిలీ విత్తనాల విక్రయాలు, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిం చటం వంటి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటా మని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, రైతులు నాణ్యమైన విత్తనా లను ఎంపిక చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షిం చారు. విత్తనమేళాలో విత్తనాలు కొనుగోలు చేసిన వారికి, యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకొన్న రైతులకు విత్తనాలను, యూరియాను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, తహశీ ల్దార్ దారా ప్రసాద్, మండల వ్యవసాయాధికారి పి. శంభో శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక దాడికి పాల్పడిన గౌస్‌ను ఉరి తీయాలి

-రజక, బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి అత్యాయత్నం చేసిన గౌస్ పాషాను ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి ఉరి తీయాలని రజక, బహుజన సంఘాల నాయకులు కోరారు. మంగళవారం రజక, బహుజన సంఘాల ఆధ్వర్యంలో బుర్హాన్‌పురం జెండా సెంటర్ నుంచి పెవిలియన్ గ్రౌండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ గౌస్‌పాషాను వెంటనే ఉరి తీయాలని బాధిత కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు కార్పొరేట్ వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, రజక సంఘం జిల్లా నాయకులు జక్కుల లక్ష్మ య్య, కత్తి నెహ్రూ గౌడ్, బోడా వీరన్న, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, శేషగిరిరావు, మధు, రమేష్, ఉపేందర్‌రావు, లక్ష్మి, నర్సయ్య, సురేష్, రాము, వెంకన్న, విజయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు మృతి



ప్రజాపక్షం/నేలకొండపల్లి: మండల పరిధిలోని భైరవునిపల్లికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ మండల కమిటీ సభ్యుడు పెదపాక వెంకటేశ్వర్లు(65) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు సీపీఎం జిల్లా నాయకుడు గుడపర్తి నాగే శ్వరరావు, మండల కార్యదర్శి కేవీ రామిరెడ్డి ఆయన భౌతికకాయా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంకితభావంతో ప్రజాసమ స్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలు అందించా రని గుర్తు చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో రచ్చ నర్సింహారావు, భూక్య కృష్ణ, దుగ్గి వెంకటేశ్వర్లు, పెదపాక మల్లేశ్వరరావు, ఎస్‌కే మహిమూద్ తదితరులు ఉన్నారు.

# పిఎస్‌ఆర్ ట్రస్ట్ సేవలు మరువలేనివి



ప్రజాపక్షం/ ఖమ్మం : విద్యారంగ అభి వృద్ధికి విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు విశేష సేవలు అందిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు సేవలు మరువలేనివని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు హెచ్. శైలేంద్రకుమార్ తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించడంతో పాటు పేద విద్యార్థులకు ట్రస్టు ఆర్థిక చేయూతని వ్వడం అభినందనీయమన్నారు. ముదిగొండ మండలం మల్లన్నపాలెం పాఠశాలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 కుర్చీ లను సమకూర్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు సహ కరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల లను మరింత బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్తులో పేదలకు మరింత విద్య చేరువవుతుందని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. ఈ ఏడాది పాఠశాలలో చేరిన విద్యార్థులకు పాఠశాల సిబ్బంది పుల్లయ్య చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోలేటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చిలకల రామకృష్ణ, పాఠశాల కమిటీ ఛైర్మన్ నాగమణి, బోధన సిబ్బంది ఉషశ్రీ, లలిత, నర్సింహారావు, సంస్కృతి, పమ్మి ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు చింతల ప్రసాద్, పమ్మి పిఎస్ ప్రధానోపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.

# గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు



ప్రజాపక్షం/ బోనకల్ : మండలంలోని కల కోట గ్రామ సమీపంలో గంజాయి సేవి స్తున్న ముగ్గురిని జిల్లా ఈగల్ ఫోర్స్, బోన కల్ పోలీసుల సంయుక్త తనిఖీల్లో అదుపు లోకి తీసుకున్నారు. వీరిలో తోటపల్లి రాహుల్, తోటపల్లి చరణ్, కార్తీక్‌లకు డ్రగ్ డిటెక్షన్ కిట్లతో పరీక్షించగా ఇద్దరు మూత్ర నమూనాల్లో టిహెచ్‌సి పాజిటివ్‌గా తేలింది. దీనితో వీరిపై ఎన్‌డిపిఎస్ చట్టం క్రింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.